ప్రారంభమెప్పుడో?

- భీమారం ఎమ్మార్సీ భవన నిర్మాణం పూర్తి
- ఏడాదవుతున్నా ప్రారంభం కాని వైనం
- పట్టించుకోని అధికారులు

భీమారం: మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం భవనం (ఎమ్మార్సీ) నిర్మాణ పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఏడాదవుతున్నా భవనం ప్రారంభించడంలో జాప్యం జరుగుతోంది. ఎమ్మార్సీ భవన నిర్మాణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.30 లక్షల నిధులు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ 2021లో పనులు ప్రారంభించి 2022లో పూర్తి చేశాడు. భవనానికి రంగులతో తీర్చిదిద్దారు. కాగా, విద్యుత్ సరఫరా, ఫర్నిచర్ ఏర్పాటు చేయకపోవడమే ఆలస్యానికి కారణమని తెలుస్తోంది.

జైపూర్ నుంచే విధులు నిర్వహణ..

ఉమ్మడి జైపూర్ మండలంలోని భీమారాన్ని ప్రభుత్వం నూతన మండలంగా ఏర్పాటు చేసింది. భీమారంలో ఎమ్మార్సీ భవనం పూర్తయినా దాన్ని ప్రారంభించలేదు. కేంద్రానికి ముగ్గురి సిబ్బందిని ప్రభుత్వం కేటాయించింది. కార్యాలయం లేకపోవడంతో 10 కి.మీ దూరంలోని జైపూర్ నుంచి విద్యాశాఖ అధికారులు పాలన కొనసాగిస్తున్నారు. ప్రతీరోజు విద్యార్థులకు సంబంధించిన రికార్డులతోపాటు మధ్యాహ్న భోజనం, మన ఊరు–మన బడి, హాజరు వివరాలు అందించేందుకు ఉపాధ్యాయులు జైపూర్ వెళ్లాల్సి వస్తోంది. భీమారం ఎమ్మార్సీ భవనం ప్రారంభిస్తే తమకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు అంటున్నారు. కాగా, జైపూర్ మండలంలో మూడు స్కూల్ కాంప్లెక్స్‌లో భీమారంలో ఒక స్కూల్ కాంప్లెక్స్ ఉండటంతో అక్కడ పని భారం పెరిగి రికార్డుల నమోదు ఆలస్యం అవుతోంది.



భీమారంలోని విద్యావనరుల కేంద్రం

అందుబాటులోకి తెస్తాం

ఎమ్మార్సీ భవనాన్ని సంబంధిత శాఖ ఇంజినీరింగ్ అధికారులు ఇంకా అప్పగించాల్సి ఉంది. ఆ తర్వాతే అవసరమైన సామగ్రి తెప్పించి అందుబాటులోకి తీసుకువస్తాం.

– రాధాకృష్ణమూర్తి, ఎంఈవో, భీమారం

త్వరలో విద్యాశాఖకు అప్పగిస్తాం

భీమారం ఎమ్మార్సీ భవనంలో విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసి త్వరలో విద్యాశాఖకు అప్పగిస్తాం. కాంట్రాక్టర్‌కు బిల్లులు రావడం ఆలస్యం కావడంతో జాప్యం జరిగింది.

– రాజేశ్వర్‌రెడ్డి, రాజీవ్ విద్యామిషన్ ఇంజినీర్

ప్రగతి పథంలో యూనివర్సల్ బ్యాంక్

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని యూనివర్సల్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 44వ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ వి.వినయ్ కుమార్ మాట్లాడుతూ బ్యాంక్‌కు 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.55.89 లక్షల నికర లాభం వచ్చిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 10 శాతం డివిడెండ్ ప్రకటించామని, మంచిర్యాల, సీసీసీలో గల బ్యాంకుల వద్ద ఏటీఎం సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. కొత్తగా మరిన్ని బ్రాంచ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, బ్యాంకు ప్రగతి కోసం సహాయ సహకారం అందిస్తున్న వాటాదారులు, ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంక్ ఇన్‌చార్జి సీఈవో మూర్తి మాట్లాడుతూ బ్యాంక్ చిన్న, మధ్య తరగతి ప్రజలకు రుణ సదుపాయం కల్పిస్తూ, వారి ఆర్థిక ప్రగతికి తోడ్పడుతుందన్నారు. బ్యాంకు నుంచి రుపే డెబిట్ కార్డులు, క్యూఆర్ కోడ్ స్కానర్ సౌకర్యం ఉందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ జి.పూర్ణచంద్రరావు, డైరెక్టర్లు జి.కృష్ణమూర్తి, ఆర్.ప్రసాద్‌రావు, జి.రాజలింగు, జె.శ్రీదేవి, కె.రత్నం, కె.సుశీల, కె.బక్కయ్య, ఎస్.భాగ్యలక్ష్మి, ఆదిత్య, శ్రీపతి శ్రీనివాస్, కె.రవీందర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ వి.వినయ్‌కుమార్

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

నస్పూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో శుక్రవారం సమ్మెకు దిగారు. మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు కొయ్యల వెంకటి మాట్లాడుతూ ఏళ్లుగా చాలీచాలని జీతాలతో ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తమను పర్మినెంట్ చేయాలని, హెల్త్ ఇన్సురెన్స్ వర్తింపజేయాలన్నారు. కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి జాక్రి అజీజ్, ఉపాధ్యక్షుడు సతీశ్ పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న కార్మికులు

క్లుప్తంగా

నేడు 5కే రన్

బెల్లంపల్లి: టీఎస్ఎల్‌పీ-2023లో భాగంగా ప్రతి ఓటరు ఓటు హక్కుపై అవగాహన పెంచుకుని వినియోగించుకోవాలనే లక్ష్యంతో శనివారం బెల్లంపల్లిలో 5కే రన్ నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్, అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు పాత బస్టాండ్ వద్ద ఉన్న తిలక్ స్టేడియం నుంచి 5కే రన్ ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ 5కే రన్‌లో పాల్గొనాలని కోరారు.

నేడు చెన్నూర్‌లో..

చెన్నూర్: పట్టణంలో నియోజకవర్గ స్థాయి 5కే రన్‌ను నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి సిడం దత్తు తెలిపారు. ఐ ఓట్ ఫర్ ష్యూర్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 6 గంటలకు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 5కే రన్ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. యువకులు, ఉద్యోగులు, క్రీడాకారులు ఈ రన్‌లో పాల్గొనాలని కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలం



ఇంటింటా ప్రచారం చేస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: పట్టణంలో మౌలిక వసతులు కల్పించడంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు పూర్తిగా విఫలం చెందారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌లో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఏ వార్డులో చూసినా రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు ఉన్నాయన్నారు. అసమర్థ ఎమ్మెల్యే వల్లనే పట్టణం అభివృద్ధి చెందడం లేదని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, రవీందర్‌రావు, రజనీశ్ జైన్, నాగుల రాజన్న, మహేశ్, పల్లి రాకేశ్, అశోక్ ఉన్నారు.

రక్తదాతలకు రూ.లక్ష ప్రమాద బీమా

మంచిర్యాలటౌన్: రక్తదాతలకు రూ.లక్ష ప్రమాదబీమా పాలసీని అందిస్తామని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కోఆర్డినేటర్ వి.మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంకులో రక్త నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయని, తలసేమియా సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు రక్తం అందించేందుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. వివరాలకు 9848195963 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



మాట్లాడుతున్న శంకర్‌గౌడ్

చెన్నూర్: ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బీసుగొణి శంకర్‌గౌడ్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్టీయూ ద్వితీయ కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని పేర్కొన్నారు. పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ కరుణాకర్, జిల్లా అదనపు కార్యదర్శి వినోద్‌కుమార్, జిల్లా కార్యదర్శి కృష్ణ, మండల నాయకులు రాజ్‌కుమార్, సురేందర్, దేవరావు పాల్గొన్నారు.

జీపీ భవనాలు పనులు త్వరగా పూర్తిచేయాలి

వేమనపల్లి: గ్రామ పంచాయతీల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో లక్ష్మయ్య సూచించారు. మండల కేంద్రంతోపాటు నాగారాం, సూరారం పంచాయతీ భవన నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ రాజ్ ఏఈ శ్రీధర్, సర్పంచ్ స్వరూపరాణి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు భీమన్న ఉన్నారు.

25 నుంచి ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు

మందమర్రిరూరల్: పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఈనెల 25, 26, 27 తేదీల్లో ఏఐటీయూసీ 16వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు మందమర్రి బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఏరియాలోని కేకే–5 గనిపై మహాసభల పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు మర్రి కుమార్, కోటయ్య, మల్లేశ్, సారయ్య ఉన్నారు.

‘గృహలక్ష్మి’కి జంగాల్‌పేట దూరం

- పరిశీలనకు నోచుకోని దరఖాస్తులు
- గ్రామాల్లో గల్లంతైన దరఖాస్తులు

నెన్నెల: అర్హులైన పేదలకు ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తీసుకువచ్చింది. దరఖాస్తులను రెవెన్యూ అధికారులు స్వీకరించి మండల పరిషత్‌కు అప్పగించారు. క్షేత్రస్థాయి పరిశీలన బాధ్యతలు కార్యదర్శులకు అప్పగించి ఈనెల 20 నాటికి పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. గడువు రెండు రోజులున్నా జంగాల్‌పేట పంచాయతీలో ఇంకా గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన ప్రారంభం కాలేదు. జంగాల్‌పేటలో 130 దరఖాస్తులు వచ్చాయి. నిరుపేదలైన గ్రామస్తులు ఈ పథకానికి దూరం కానున్నారు. ఇదిలా ఉండగా మండలంలో 2270 దరఖాస్తులు రాగా, గుండ్లసోమారం, మన్నెగూడం, నందులపల్లి, గొల్లపల్లి పంచాయతీలతోపాటు మరికొన్ని గ్రామాల్లో దరఖాస్తుదారుల దరఖాస్తులు గల్లంతయ్యాయి. కార్యదర్శులు వారి దగ్గరకు వెళ్లి వివరాలు, తదితర పత్రాలు గురించి ఆరా తీస్తూ పరిశీలిస్తున్నారు. పరిశీలనలో కొందరు దరఖాస్తుదారుల దరఖాస్తులు లేకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. స్వీకరించిన దరఖాస్తులు ఏమైనట్టు, ఎక్కడ గల్లంతైనట్లు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే దరఖాస్తులు మాయమయ్యాయని తమకు దరఖాస్తు చేసుకునే అవకాశం మళ్లీ కల్పించాలని బాధితులు కోరుతున్నారు.



నందులపల్లిలో గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలిస్తున్న కార్యదర్శి పద్మనాభం

ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



జన్నారం: పూలమాల వేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



దండేపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు



చెన్నూర్‌లో పూలమాల వేస్తున్న గౌడ కులస్తులు

జన్నారం: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని తెలంగాణ గౌడ సంఘం, మోకు దెబ్బ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఆర్టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ పాపన్నగౌడ్ ఆశయాలు మరువలేనివని, ఆయన వీరత్వం నేటి యువకు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షనీయమన్నారు. మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు బాలసాని శ్రీనివాసగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, రైతు బంధు సమితి అధ్యక్షుడు రాజారాంరెడ్డి, ఏఎంసీ జిల్లా డైరెక్టర్ భరత్ కుమార్, ఎంపీటీసీ రియాజొద్దీన్, ఎంపీటీసీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పలు పార్టీల నాయకులు, మోకుదెబ్బ నాయకులు సర్సాగౌడ్, సతీశ్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు పోచగౌడ్, తిరుపతిగౌడ్, బీఆర్ఎస్ నియోజక వర్గ నాయకుడు జాన్సన్‌నాయక్ పాల్గొన్నారు.

దండేపల్లి: దండేపల్లిలో గౌడ సంఘం నాయకులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజన వీరుడు సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడ కులస్తులు కొనియాడారు. సంఘం నాయకులు చంద్రగౌడ్, శ్రీనివాస్, రవిగౌడ్, కుమారస్వామి, రమేశ్, వెంకటేశ్‌గౌడ్, స్వామిగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, శంకర్‌గౌడ్, సుధాకర్, తిరుపతి పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని జగన్నాథాలయ సమీపంలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని నిర్వహించారు. గౌడ సంఘం మండల అధ్యక్షులు కుర్మ ఆశోక్‌గౌడ్, నాయకులు లక్ష్మీరాజగౌడ్, నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, మల్లాగౌడ్, రఘువీర గౌడ్, మూర్తిగౌడ్ పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమిని: కన్నెపల్లి మండలంలోని రెబ్బెనలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం నాయకులు నారాగౌడ్, ప్రశాంత్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, సాయిగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

తాండూర్: మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో గౌడ జన హక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ రాష్ట్ర కార్యదర్శి బూసారపు మెండేగౌడ్ తదితర నాయకులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేశారు. జెడ్పీటీసీ బానయ్య, ఎంపీపీ ప్రణయ్‌కుమార్, ఎంపీడీవో ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజశేఖర్ గౌడ్, నాయకులు పోశగౌడ్, వెంకటేశ్‌గౌడ్, తిరుపతిగౌడ్, రవిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ముగిసిన పల్లెపల్లెకూ కాంగ్రెస్ పాదయాత్ర


కాసిపేట: మండలంలో చేపట్టిన పల్లె పల్లెకూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ పాదయాత్ర ఆరో రోజూ శుక్రవారంతో ముగిసింది. కాసిపేటలో ప్రారంభించి పెద్దనపల్లి, నాయకపుగూడ, దుబ్బగూడెం, ట్యాంక్ బస్తీ, ఎన్‌టీఆర్ కాలనీ, లంబాడితండా, సోమగూడెంలో నిర్వహించి కొత్తకాలనీలో బస చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్, రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గారడీ మాటల ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలో వస్తుందని ఖాయమన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు, పెద్దనపల్లి సర్పంచ్ వేముల కృష్ణ, మహిళా రాష్ట్ర కార్యదర్శి రొడ్డ శారద, నాతరి స్వామి, బెల్లంపల్లి మండల సీనియర్ నాయకులు రొడ్డ శ్యాం, కంకటి శ్రీనివాస్, నాయకులు శంకర్, ప్రభాత్‌రావు, గోలేటి స్వామి, షాకీర్, కనుకుల రాకేశ్, కుమార్, కనకరాజు, వెంకటేశ్, మైదం రమేశ్, అచ్యుతరావు, అనంతరావు, దూడం మహేశ్, కొత్త రమేశ్, పంబాల తిరుపతి, ఖదీర్, కలీం ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తప్పుడు పోస్టుపెట్టిన యువకుడిపై ఫిర్యాదు

తాండూర్: మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వినోద్‌పై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టు చేసిన ఓ యువకుడిపై కాంగ్రెస్ నాయకులు శనివారం ఎస్సై రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. మాదారం గ్రామానికి చెందిన జోగిరాల రమేశ్ ఉద్దేశ పూర్వకంగా కాంగ్రెస్ శ్రేణుల మనోభావాలు దెబ్బ తీసేలా పోస్టు పెట్టాడని, సదరు యువకుడిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా ఫిర్యాదులో పేర్కొన్నాడు.



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వైద్య శిబిరానికి స్పందన

నెన్నెల: మండల కేంద్రంలోని దుబ్బపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం ఇండియా క్యాంపస్ క్రూసెడ్ ఫర్ క్రిస్ట్, బైబుల్ కమ్యూనిటీ చర్చ్ మంచిర్యాల ఫీల్డ్ ఆధ్వర్యంలో నెన్నెల పాస్టర్లు స్టీవెన్, రజిణి సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామలతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మండలంలోని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన 300 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సుమారు రూ.70 వేల విలువ కలిగిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు ఈసీజీతోపాటు షుగర్, బీపీ పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో గుండె, కంటి, ఎముకలు, నరాలకు సంబంధించిన పరీక్షలు తదితర చేశారు. విజయవాడకు చెందిన జనరల్ ఫిజిషియన్ డాక్టర్ భరత్, ఏలూరుకు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ కుమార్, చెన్నైకి చెందిన డెంటిస్ట్ డాక్టర్ అలెన్, కన్యాకుమారికి చెందిన కంటి వైద్య నిపుణులు డాక్టర్ రమేశ్, మంచిర్యాలకు చెందిన కంటి వైద్య నిపుణులు డాక్టర సన్నిధి, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సుష్మిత, పీహెచ్‌సీ వైద్యులు లక్ష్మణ్‌ను ఎంపీపీ, జెడ్పీటీసీలు అభినందించారు. ఆర్ఎంపీలు పురుషోత్తం, రాజశేఖర్, ఎంపీటీసీ తిరుపతి, సర్పంచ్ సుజాత–శ్రీనివాస్ పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు

రామకృష్ణాపూర్: నిర్లక్ష్యం, అజాగ్రత్తల వల్లే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య అన్నారు. పట్టణంలోని ఆర్కే సీఓఏ క్లబ్‌లో శుక్రవారం రోడ్‌సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్, అభయ యాప్‌పై ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఆటో ఎక్కిన ప్రయాణికుడిని సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లపై ఉంటుందనేది గుర్తించాలన్నారు. పరిమితికి మించి ఓవర్‌లోడ్‌తో వాహనాలు నడపొద్దన్నారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు తమవెంట తెచ్చుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణ ఎస్ఐ అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ సదయ్య

వేమనపల్లిలో భారీ వర్షం



ఉధృతంగా ప్రవహిస్తున్న ఎంచపాయ

వేమనపల్లి: మండలంలో శుక్రవారం ఉదయం నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. మత్తడి వాగు, కొత్తపల్లి వాగు, ఎంచపాయ వరద నీటితో ఉధృతంగా ప్రవహించాయి.

పోస్టర్ ఆవిష్కరణ

రామకృష్ణాపూర్: పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో ఈనెల 21న నిర్వహించే ఏఐటీయూసీ రామకృష్ణాపూర్ బ్రాంచి 12వ మహాసభల పోస్టర్‌ను నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. మహాసభల్లో సింగరేణి కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. యూనియన్ బ్రాంచి కార్యదర్శి అక్బర్ అలీ, ఇప్పకాయల లింగయ్య, అంజనేయులు, రాజేశ్వర్‌రావు, రాజశేఖర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

‘జనక్‌ప్రసాద్‌కు రామగుండం టికెట్ ఇవ్వాలి’

నస్పూర్: వచ్చేఎన్నికల్లో రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ టికెట్‌ని కాంగ్రెస్ అధిష్టానం ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌కు కేటాయించాలని శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ జె.శంకర్‌రావు కోరారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన యూనియన్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జనక్ ప్రసాద్‌కు టికెట్ కేటాయించాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని తెలిపారు. కాంగ్రెస్ అధిష్టానానికి వినతిపత్రం సమర్పిస్తామన్నారు. నాయకులు భీంరావు, కలవేణ శ్యాం, గరిగ స్వామి, నరేందర్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన రజిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, ఆమె కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపగా, వాటిని స్థానిక కాంగ్రెస్ నాయకులు శుక్రవారం అందజేశారు. ఎంపీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు త్రిమూర్తి, దుర్గాప్రసాద్, నవీన్, రవి, మంచిర్యాల నాయకులు లావణ్య, సతీశ్, రజిత పాల్గొన్నారు. అదేవిధంగా రజిత కుటుంబానికి చెల్కగూడ సర్పంచ్ తిరుపతి, నాయకులు శ్రీనివాస్, హరీష్, వెంకటేశ్, రాజశేఖర్‌లు సరుకులు అందజేశారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

చెన్నూర్: పట్టణంలోని 5వ వార్డు పరిధిలో గల ఇందిరానగర్ కాలనీలో గృహలక్ష్మికి కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు శుక్రవారం పరిశీలించారు. దరఖాస్తుదారుల స్థితిగతులను తెలుసుకున్నారు. కౌన్సిలర్ నసీమాబేగం, విచారణ అధికారి రాజ్‌కుమార్, వార్డు అధికారి మతిన్, ఆర్పీ స్వప్న ఉన్నారు.

ఓపెన్ డిగ్రీ ప్రవేశాల గడువు పొడగింపు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందేందుకు సెప్టెంబర్ 5 వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఇంటర్‌కు సంబంధించిన కోర్సుల విద్యార్థులు ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు. వివరాలకు అధ్యయన కోఆర్డినేటర్ రామకృష్ణను సంప్రదించాలని సూచించారు.

గ్యాస్ సిలిండర్ అందజేత

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన నిరుపేద అయిన లచ్చవ్వకు శ్రీ శివసాయి గణేశ్‌సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా గ్యాస్ సిలిండర్, నాలుగు నెలల పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీరామ్మూర్తి, సభ్యులు సాయిచరణ్, రవిచంద్ర, వెంకట్రావుపేట సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ

నెన్నెల: రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా నెన్నెలకు మంజూరైన ఆరు యూనిట్లను జెడ్పీటీసీ శ్యామలతో కలిసి ఎంపీపీ రమాదేవి శుక్రవారం ఆరుగురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి దిలీప్, ఎంపీటీసీ తిరుపతి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాంచందర్, తోట శ్రీను, పూదరి అంజన్న పాల్గొన్నారు.

పాఠశాలలో అభివృద్ధి పనుల పరిశీలన

తాండూర్: మన ఊరు–మన బడిలో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంఈవో వాసాల ప్రభాకర్ శనివారం పరిశీలించారు. డైనింగ్ హాల్, హ్యాండ్ వాష్ పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఆయా పనులను సత్వరం పూర్తి చేయించాలని హెచ్ఎం ప్రేమలతను ఆదేశించారు. ఆ తర్వాత మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ఏరియర్స్ వెంటనే చెల్లించాలి

నస్పూర్: 11వ వేజ్‌బోర్డు వేతన ఒప్పందానికి చెందిన ఏరియర్స్‌ని ఆగస్టు నెల జీతంతో పాటు కలిపి చెల్లించాలని గోదావరి లోయ బొగ్గు గని సంఘం (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.విశ్వనాథ్ డిమాండ్ చేశారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లాభాల వాటాను సింగరేణి కార్మికులతోపాటు కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాలన్నారు. సింగరేణి వ్యాప్తంగా సర్ఫేస్‌లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. నాయకులు రాములు, రామకృష్ణ, ఎస్ ప్రసాద్, సంపత్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలు కబ్జా

నస్పూర్: మున్సిపాలిటీలో పలు ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా కబ్జాకు గురి అవుతున్నాయని బీఎస్పీ మహిళా జోనల్ కన్వీనర్ మద్దెల భవాని ఆరోపించారు. శుక్రవారం శ్రీరాంపూర్‌లో ఆమె మాట్లాడుతూ 4వ వార్డులో ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేసి షెడ్డు వేసి చుట్టూ ప్రహరీ నిర్మించారన్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని తెలిపారు. శ్రీరాంపూర్‌లో కబ్జాకు గురైన స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకోకుంటే బీఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి చేపడుతామని హెచ్చరించారు. నాయకులు శిరీష, కనుకుంట్ల అజయ్ ఉన్నారు.

‘పోడు’కు పట్టాలిచ్చిన ఘనత కేసీఆర్‌దే



జాన్సన్ నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

జన్నారం: పోడు భూములకు పట్టాలిచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు భుక్య జాన్సన్ నాయక్ పేర్కొన్నారు. మండలంలోని అలీనగర్, దొంగపల్లి, మల్యాల గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను వివరించారు. సీఎం అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా పథకాలను ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మల్యాల సర్పంచ్ హన్మంతరావు, మాజీ సర్పంచ్ పోశన్న, నాయకులు నర్సింహులు, ఫజల్‌ఖాన్, సురేశ్, గోపాల్, రాజగౌడ్, వెంకటేశ్, ఎల్లయ్య, మల్లేశ్, తిరుపతి, నవీన్, అంజిత్, రాజు ఉన్నారు.

సాక్షి
దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
చెన్నూర్ : క్రిష్ణ - 8309865990
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899